క్లుప్తంగా

సేవలు అభినందనీయం

శావల్యాపురం: మండలంలోని గంటావారి పాలెం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.మాధవీలత ఉత్తమ సేవలకు జిల్లా కలెక్టరు లోతేటి శివశంకరు చేతులమీదుగా అవార్డు ప్రశంస పత్రం అందుకున్నట్లు సెక్టారు సూపర్‌వైజరు కుప్పం శ్రీలత బుధవారం తెలిపారు. ఈసందర్భంగా సూపర్‌వైజరు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు పురస్కరించుకొని ఉత్తమ సేవలకు గాను అవార్డు అందుకోవటం మంచి శుభాపరిణామన్నారు. ఈసందర్భంగా సీడీపీవో ముదివర్తి అనురాధ, సహచర కార్యకర్తలు ప్రత్యేకంగా అభినందించారు.

అల్లరి మూకల స్వైర విహారం

ఇళ్ల ముందున్న వాహనాలు, టిఫిన్ హోటళ్ల సామగ్రి ధ్వంసం

నరసరావుపేట: పట్టణంలోని ప్రకాష్‌నగర్ ఆర్టీసీబస్టాండ్–రైల్వేస్టేషన్‌రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి సమయంలో కొందరు యువకులు కర్రలు చేబూని పెద్దగా కేకలు వేస్తూ స్వైర విహారం చేశారు. ఇళ్లముందు నిల్పోబెట్టబడిన వాహనాలను కిందపడేశారు. రోడ్డు మార్జిన్లలో టిఫిన్ బండ్ల సామాగ్రిని కర్రలతో కొట్టి ధ్వంసం చేశారు. వారందరూ మద్యం సేవించి ఉన్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. తమపై దాడిచేస్తారనే కారణంతో చూసిన వారెవరూ నివారించలేదు. నైట్‌బీట్ పోలీసుల జాడ కన్పించలేదు. ఈ ప్రాంతంలో హాస్టళ్లు ఎక్కువగా ఉండటంతో విద్యార్థుల సందడి ఎక్కువగా ఉంటుంది. ఇదిలా ఉండగా బర్త్‌డే వేడుకలు అంటూ అర్ధరాత్రి సమయంలో రోడ్డుపై ద్విచక్రవాహనాలను నిలబెట్టి కేకులు కట్‌చేస్తూ బాణాసంచాలు కాల్చి పెద్దగా కేకలు వేయటం పరిపాటిగా మారింది. ఆ సమయంలో ఇళ్లల్లో గాఢనిద్రలో ఉన్న వారందరూ వారు చేసే గొడవకు ఉలిక్కిపడి లేచి ఏమిజరిగిందోనంటూ బయపడుతున్న సందర్భాలు అనేకం. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం మేల్కొనకపోతే అల్లరి మూకల ఆగడాలు మరీ పెరిగిపోయి అమాయకుల ఆస్తులు, ప్రాణాలకు ఇబ్బందికలిగే అవకాశం పొంచి ఉంది.

నేటితో బ్రహ్మోత్సవాలకు ముగింపు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీభూసమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటితో ముగుస్తాయని ఆలయ పూజారి డి.వి.మారుతీరామచార్యులు బుధవారం తెలిపారు. మూడోవ రోజు ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు–ధర్మపత్నీ ఆదిలక్ష్మి దంపతుల, కుమారుడు బొల్లా శ్రీనివాసరావు, గిరిబాబు దంపతులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శేషవాహనంపై ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవాలయాన్ని బ్రహ్మోత్సవాలు సందర్భంగా విద్యుత్ దీపకాంతులతో ముస్తాబు చేశారు. చివరిరోజు భారీ అన్నదాన కార్యక్రమంతో పాటు పలు రకాల సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేడు యడ్లపాడు మండల సమావేశం

యడ్లపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై హనుమారెడ్డి తెలిపారు. ఎంపీపీ పిడతల ఝాన్సీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశమునకు అన్ని శాఖల అధికారుల విధిగా హాజరు కావాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన రికార్డులతో హాజరై శాఖల వారీగా జరిగే సమీక్షలు ప్రగతి వివరాలను వెల్లడించాల్సి ఉంటుందన్నారు. అలాగే గౌరవ సభ్యులందరూ పాల్గొని గ్రామాల వారీగా స్థానిక సమస్యలను ఎంపీపీ దష్టికి తీసుకువచ్చి పరిష్కార యోగ్యానికి కృషి చేయాలని కోరారు.

గుండెపోటుతో గుమాస్తా మృతి

నాదెండ్ల: గణపవరంలోని ఓ ప్రైవేటు ఆయిల్ మిల్లులో గుమస్తాగా పనిచేస్తున్న సోమేపల్లి రవికుమార్ (51) గుండెపోటుతో మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. బాపట్ల జిల్లా యద్దనపూడి గ్రామానికి చెందిన రవి గత కొన్నేళ్లుగా గణపవరంలోని ప్రైవేటు మిల్లులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ యద్దనపూడి నుంచివస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 8 గంటలకు డ్యూటీకి మిల్లుకు వచ్చాడు. 11 గంటల సమయంలో గుంటూరు నుంచి వచ్చిన పత్తి విత్తనాల లోడును లారీలో నుంచి దింపిస్తున్నాడు. శాంపిల్స్ తీసుకుంటున్న రవి ఒక్కసారిగా కుప్పకూలాడు. అదేలారీలో ఆయన్ను చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహన్ని స్వగ్రామమైన తాతపూడికి తరలించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

నరసరావుపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీ శ్రీనివాసరావు, నరసరావుపేట, పిడుగురాళ్ల డిపో మేనేజర్లు బత్తుల వీరాస్వామి, ముక్తేశ్వరావు మాట్లాడుతూ వివిధ రంగాలలో ప్రతిభ కనబర్చిన మహిళల గురించి మాట్లాడుతూ వారిని ఆదర్శంగా తీసుకొని మరింత అభివృద్ధి పథంలో ఆర్టీసీని సంస్థను నడపాలని అన్నారు.

నరసరావుపేట ఈస్ట్: మహిళలు అన్ని రంగాలలోనూ ముందుండి ప్రగతి సాధించాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఏ.శోభారాణి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి వివిధ రంగాలలోని మహిళలను సత్కరించారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో న్యాయమూర్తి శోభారాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

అన్ని రంగాల్లో రాణించాలి

చిలకలూరిపేటటౌన్: మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని డీఆర్ఎన్ సీవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరా సుజాత చెప్పారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

నాదెండ్ల పీహెచ్‌సీలో మహిళా దినోత్సవం

నాదెండ్ల: పురుషాధిక్య సమాజంలో అణచివేతకు గురౌతున్న మహిళలు తమ హక్కుల పరిరక్షణకు గళమెత్తిన రోజును అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకోవటం సంతోషకరమని వైద్యాధికారి డాక్టర్ సాయిశ్వేత చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు.

వినుకొండలో....

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ అశోక్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో పట్టణ ఎస్ఐ రాజ్యలక్ష్మి, పలువురు మహిళా పోలీసులను సత్కరించారు.

మున్సిపల్ కార్యాలయంలో....

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ.తౌషిద్ హుస్సేన్ సహకారంతో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



నరసరావుపేటలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శోభారాణి


నరసరావుపేటలో మహిళా ఉద్యోగులను సన్మానించి సర్టిఫికెట్లు అందజేస్తున్న శ్రీనివాసరావు

ఆర్టీసీ ఆధ్వర్యంలో...

స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపో నందు ట్రాఫిక్ ఇన్‌చార్జి కార్యాలయంలో ఎన్ఎంయూ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పట్టణ ఎస్ఐ రాజ్యలక్ష్మి పాల్గొని మాట్లాడారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: మండలంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జలజీవన్ మిషన్ మండల కో–ఆర్డినేటర్ బాబూరావు, డబ్ల్యూఎస్ సి. రమేష్ పాల్గొన్నారు. అదే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ నాగలక్ష్మిని గ్రామపెద్దలు, డ్వాక్రా మహిళలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తనను సన్మానించిన వారికి బ్యాంకు మేనేజర్ నాగలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించినట్లు బ్రాంచ్ మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్ తెలిపారు. ఈసందర్భంగా బ్రాంచ్ మేనేజరు మాట్లాడుతూ మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.


వినుకొండలో ఎస్ఐ రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న పట్టణ సీఐ అశోక్‌బాబు, పోలీసులు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు తాళ్ల అంజిరెడ్డి


రొంపిచర్లలో ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ నాగలక్ష్మిని సన్మానిస్తున్న గ్రామపెద్దలు

జాగ్రత్త... పరువు నష్టం కేసు పెడతా

- హత్యలో మా ప్రమేయముందంటూ మాట్లాడకండి!
- టీడీపీ నాయకుడు అరవిందబాబును హెచ్చరించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: టీడీపీ నాయకుడు వెన్నా బాలకోటిరెడ్డి హత్యలో మా ప్రమేయం ఉందని మరోసారి మాట్లాడితే నీపై పరువునష్టం దావావేసి కోర్టుకు ఈడ్చుతానని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి టీడీపీ ఇన్‌చార్జి అరవిందబాబును హెచ్చరించారు. మాకు సంబంధం లేదని పలుమార్లు తాను చెప్పినా డాక్టర్ చదలవాడ అరవిందబాబు పదేపదే హత్యలో తమ ప్రమేయముందని చెబుతుండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక అబద్ధాన్ని పదేపదే ప్రచారం చేయటం టీడీపీ నైజమనే విషయం మరోసారి రుజువు అవుతోందన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడారు. అతని దగ్గర సాక్ష్యాలు ఉంటే నిరూపించాలని నేను సవాల్ విసిరితే విన్పించుకోనట్లు నటిస్తూ పదే పదే అబద్ధాలను ప్రచారం చేస్తున్నాడన్నారు. బాల కోటిరెడ్డి మరణ వాంగ్మూలంలో తన పేరుగాని, వైఎస్సార్‌సీపీ మండల నాయకుల పేర్లుగాని చెప్పలేదన్నారు. ఆయన నిజాయితీగా వ్యవహరిస్తే అరవిందబాబు చనిపోయిన బాలకోటిరెడ్డి పరువు తీస్తున్నాడన్నారు. నిజమేమిటో అతని భార్య కూడా స్పష్టం చేసిందన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే తన సవాల్‌కు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. సాక్ష్యాలు ఉంటే నా సవాల్‌ను స్వీకరించి ముందుకు రావాలన్నారు. పిచ్చి ప్రేలాపనలు మాట్లాడుతూ ఉంటే ఇక చూస్తూ సహించేది లేదన్నారు. హత్యకు అతని సమీప బంధువు, టీడీపీ నాయకుడు పమ్మి వెంకటేశ్వరరెడ్డి కారణమంటూ టీడీపీ నాయకులు ప్రచురించిన కరపత్రంలోనే స్పష్టంగా ఉందన్నారు. ఆ కరపత్రాన్ని ఎమ్మెల్యే గోపిరెడ్డి చదివి విన్పించారు.


టీడీపీ నాయకులు వేసిన కరపత్రంలోని అంశాన్ని చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారు!

నియోజకవర్గ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న ఘనత అరవింద్‌బాబుది అన్నారు. అతని చుట్టూ ఉన్న నలుగురిలో ముగ్గురు కూడా అతనికి అనుకూలంగా లేరన్నారు.నిజాయితీగా పనిచేసే నాయకుడు ఎవరో కూడా తెలుసున్నారు. పంచెలు తడుపుకునే బ్యాచ్ మాదికాదని, అది టీడీపీదే అన్నారు. పురపాలక సంఘంలో ఏదో అవినీతి జరిగిందని అసత్యాలు మాట్లాడుతున్న అరవింద్‌బాబు సత్యాలు తెలుసుకోవాలనే ఓపిక అతనికి లేదన్నారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకు బాబు కుట్ర రాజకీయాలు

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ఇటీవల విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ విజయవంతం కావడం ప్రతిపక్షనేతలు చంద్రబాబు అండ్ కోకు నిద్రపట్టడం లేదని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ విశాఖలో జరిగిన సదస్సులో రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు పారిశ్రామికవేత్తలు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చారని, 352 ఎంఓయూ ఒప్పందాలు జరిగాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దిగ్గజ పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులను చూసి చంద్రబాబు, లోకేష్, పచ్చమీడియా దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ హయాంలో ఒక్క కంపెనీ కూడా రాలేదన్నారు. తమ హయాంలో ముస్లిం మైనార్టీలకు కళాశాలలు, ఎస్టీ కళాశాల, హాస్టల్, షాదీ ఖానాతో పాటు వినుకొండలో మున్సిపల్ కాంప్లెక్స్, స్టేడియం, తాగునీటి సమస్య, ఘాట్ రోడ్డు నిర్మాణం, ఎన్ఎస్‌పీ కాలువల అభివృద్ధి వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తుచేశారు. ఇప్పటికైనా నీచరాజకీయాలు మానుకొని నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష నాయకులుగా వ్యవహరించాలని హితవుపలికారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

కౌమార విద్యపై శిక్షణ

- వర్చువల్ విధానంలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 84 హైస్కూల్ టీచర్లు హాజరు

యడ్లపాడు: బాలబాలికలకు కౌమర విద్యపై సమగ్ర అవగాహన కలిగి ఉన్నప్పుడే ఆకర్షణ, వేధింపులు, ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉండదని ఎస్‌సీఈఆర్‌టీ అధ్యాపకులు భానుమతి, పద్మావతి తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీ ఆదేశాల ప్రకారం జిల్లా విద్యా శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని 84 ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు మండలంలోని బోయపాలెం డైట్ కళాశాలలో కౌమార విద్యపై వర్చువల్ విధానంలో మాస్టర్ ట్రైనింగ్ క్లాసుల్ని నిర్వహించారు. ప్రధానంగా కౌమార దశలో వివాహం, గర్భధారణ జరగకుండా నిరోధించుట, బాధ్యతాయుతమైన లైంగిక ప్రవర్తనపై విద్యార్థిని, విద్యార్థులు అవగాహన కల్పించాల్సిన అంశాలను ఆన్‌లైన్ ద్వారా విశదీకరించారు. ఇందులో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల వారికి సమగ్ర అవగాహన కల్పించాలని తెలిపారు. వీరితో పాటు డైట్‌కళాశాల అధ్యాపకులు యోగేశ్వరరావు, డాక్టర్ కె.ప్రసాదరావు, తోకల శ్రీనివాస్, పి.లలిత కుమారి, డాక్టర్ ఎం.సౌజన్య బాల్య వివాహాలు నిరోధించుట, అక్రమ మానవ తరలింపు, విద్య చట్టం తదితర హక్కులతో పాటు వివిధ పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని పర్యవేక్షించారు.


వర్చువల్ విధానంతో శిక్షణ కల్పిస్తున్న దృశ్యం

కిటకిటలాడిన మసీదులు

యడ్లపాడు: ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని అన్ని మసీదులు కిటకిటలాడాయి. ఇస్లాం కేలండర్ ప్రకారం రంజాన్‌కి ముందుగా వచ్చే షాబాన్ మాసంలోని 15వ రోజున పవిత్ర జాగారం రేయిగా ముస్లింలు భావిస్తారు. తమ పాపపరిహారాలను అనంత కారుణ్యమూర్తి అల్లాహ్ క్షమిస్తాడని విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఇళ్లలో చనిపోయిన తమ పెద్దలను స్మరిస్తూ పండుగ చేసుకున్నారు. అనంతరం మగ్‌రిబ్ నమాజ్ సమయానికి కొత్త దుస్తులు ధరించి ముస్లిం సోదరులు తమ ప్రాంతాల్లోని మసీదులకు హాజరయ్యారు. పిల్లలు పెద్దలతో మసీదులు నిండి ఆధ్యాత్మిక సందడి చేకూరింది. ఈ సందర్భంగా మసీదులకు విద్యుత్ దీపాలను అలంకరణ చేశారు. ప్రత్యేక నమాజులు, దువాలు, మతపెద్దల ఖురాన్ బోధనలు వింటూ రేయంతా జగారం చేశారు. తెల్లవారుజామున ఒకరోజు ఉపవాసదీక్షలు బూనారు.



రంగుల హోలీ.. ఆనందాల కేళీ

యడ్లపాడు: రంగుల హోలీ వేడుకలు బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం అంతటా విద్యార్థులు, మహిళలు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రసాయనాలు లేని సహజ సిద్ధమైన రంగుల్ని ఒకరిపై ఒకరు చల్లుకుంటూ తమ సంతోషాలను వ్యక్తం చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోళి ఉత్సవాలను నిర్వహించుకుంటూ వీధుల్లో సందడి చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఉట్టిని కట్టి హోలి రంగుల్ని చల్లుకుంటూ పోటీ పడ్డారు. ఉపాధి నిమిత్తం క్వారీ, క్రషర్స్, నూలుమిల్లులకు వలస వచ్చిన ఉత్తరాది కుటుంబాలు హోలీ వేడుకల్ని సంబరంగా చేసుకున్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల) : హోలీ పండుగ సందర్భంగా పట్టణంలోని వెల్లటూరు రోడ్డు నందు సుగాలీల సమ్మేళన హోలీ పండుగ సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని అందరికి హోలీ, అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ సుగాలీల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. నియోజకవర్గ సుగాలీల కోసం వెల్లటూరు రోడ్డులో కల్యాణమండపం, సేవాలాల్ మహరాజ్ దేవాలయం నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిను సుగాలీలు గజమాలతో సత్కరించారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: హోలీ పర్వదినాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించటంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు పనిచేయలేదు. ముఖ్యంగా మేజర్ పంచాయతీ గణపవరం పారిశ్రామిక కేంద్రంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు హోలీని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని పలు గ్రామాల్లో హోలీ పర్వదినం వేడుకలు చిన్నారులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా చిన్నారులు వీధుల్లో అన్నీ రంగుల కలిపిన నీళ్లను డబ్బాలో పోసుకొని ఒకరు ఒకరుపై పోసుకున్నారు.ఉల్లాసంగా ఉత్సాహంగా కేరింతలు నడుము వేడుకల్లో పాల్గొని తమ ఆనందాన్ని చిన్నారులు పంచుకున్నారు. పెద్దలు ఒకరునొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గజమాలతో సత్కరిస్తున్న సుగాలీలు

ఈశ్వర్ కళాశాల జట్టుకు బహుమతి

నరసరావుపేట రూరల్: ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుల క్రికెట్ జట్టు విట్–అమరావతి క్రికెట్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. విట్ కళాశాలలో నిర్వహించిన విటోపియా–23 టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో ముఖ్యఅతిథిగా హాజరైన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధూ చేతుల కళాశాల జట్టు బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. జట్టులోని క్రీడాకారులను కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, కార్యదర్శి షేక్ కరీంమొహిద్దీన్, డైరెక్టర్ షేక్ మస్తాన్‌షరీఫ్ అధ్యాపకులు అభినందించారు. అధ్యాపకుల ప్రొఫెషనల్ జీవన సరిలో క్రీడలు భాగమవ్వాలని వారు తెలపారు. మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని వారు వివరించారు.


క్రీడాకారిణీ పీవీ సింధూ నుంచి బహుమతి అందుకుంటున్న కళాశాల అధ్యాపకుల జట్టు


బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు బాలికల జట్టు ఎంపిక

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జూనియర్ బాలికల విభాగంలో (అండర్–19) ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించినట్లు పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి బుధవారం తెలిపారు. ఈఎంపిక పోటీలను గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సెక్రటరీ ఈ.శివశంకర్ పర్యవేక్షించారు.ఎంపికైనా జూనియర్ బాలికలు ఈనెల 17 నుంచి 19 తేదీ వరకు నెల్లూరు జిల్లా కావలిలో జరిగే 7వ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారన్నారు.ఎంపికైన విద్యార్థినులు యం.లిఖత (కనమర్లపూడి) ఎస్‌కె. సమీరా (పసుమర్రు) ఆకుమళ్ళ సమీరా, ఓర్చు స్రవంతి, ముట్లూరి లూధియా, వి.దివ్య, వి.బసవరాణి, బి.దేవమణి, కె.కావ్య (శావల్యాపురం) సీహెచ్. హర్షిత, అమూల్యా (నరసరావుపేట) స్టాండ్ బైస్‌గా టి. అంజన, హర్షీత, బి.రవళి (శావల్యాపురం) ఉమ్మడి గుంటూరు జట్టుకు ఎంపికైనట్లు పీడీ రాధాకృష్ణమూర్తి తెలిపారు.


ఎంపికైన జూనియర్ బాలికల జట్టు

వేసవి కోసం నీటితో తాగునీటి చెరువులు ఫుల్

నరసరావుపేట: వచ్చే వేసవిలో పురపాలకసంఘం పరిధిలోని ప్రజలకు తాగునీటి ఎద్దడిలేకుండా రిజర్వాయర్లను నీటితో సిద్ధం చేశారు. శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అధికారులు బుధవారం నకరికల్లులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, శాంతినగర్ చెరువులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ రాబోయే వేసవికాలంలో పట్టణ ప్రజలు ఎటువంటి ఇబ్బంది పడకుండా మంచినీటి సరఫరా చేయాలని ఎమ్మెల్యే సూచించారన్నారు. ఈ మేరకు తాము చర్యలు తీసుకున్నామన్నారు. రెండు చెరువులు పూర్తిస్థాయిలో నింపడం జరిగినదని, శాంతినగర్ వాటర్‌ప్లాంట్‌లో ఫిల్టర్‌బెడ్స్ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడం జరిగిందన్నారు. రాబోయే వేసవి కాలంలో పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలియజేశారు.


శాంతినగర్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

సాధికారత దిశగా నిర్ణయాలు తీసుకోవాలి

నరసరావుపేట రూరల్: తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి దిశ సీఐ సుభాషిణీ, డాక్టర్ కె.భారతీదేవిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు వారి సాధికారత కోసం నిర్ణయాలు తీసుకుని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్య ద్వారానే మహిళా సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.